క్లుప్తంగా

బాలవికాస ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



గాగిళ్లాపూర్‌లో చలివేంద్రం

బెజ్జంకి(సిద్దిపేట): బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో శనివారం జలదాన (చలివేంద్రాలు) కేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా శనివారం ఆ సంస్థ కోఆర్డినేటర్ వట్టి సుజాత మాట్లాడుతూ గాగిళ్లాపూర్, గుగ్గిల్ల గ్రామాలలో సుమారు పదేళ్లుగా చలివేంద్రాలు నిర్వహిస్తూ ప్రజల దాహార్తిని తీరుస్తున్నామన్నారు. వేసవిలో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురి కావద్దని ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

మహిళలూ.. మౌనం వీడండి


కూలీలకు అవగాహన కల్పిస్తున్న షీటీమ్

హుస్నాబాద్‌రూరల్: మహిళలు మౌనం వీడి నిజం నిర్భయంగా చెపితే న్యాయం జరుగుతుందని షీటీమ్ ప్రతినిధి వాణి అన్నారు. శుక్రవారం పందిల్ల గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి కూలీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఇళ్లవద్ద, గ్రామాల్లోను మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపుల గురించి నిర్భయంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం పోలీసుశాఖ ఆధ్వర్యంలో షీటీమ్‌లను ఏర్పాటు చేసిందని, షీటీమ్ బృందాలు గ్రామా ల్లో తిరిగి మహిళల రక్షణకు చర్యలు తీసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సదయ్య, ప్రశాంతి, స్వప్న పాల్గొన్నారు.

టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గం


రామచంద్రం

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతన అధ్యక్షుడిగా అందె రామచంద్రం, ప్రధాన కార్యదర్శిగా గజబింకర్ రాజు, ఉపాధ్యక్షులుగా సాహెబ్ హుస్సేన్, అన్నెబోయిన శ్రీనివాస్, కోశాధికారిగా నేరండ్ల నరేశ్, సహాయ కోశాధికారిగా తోకల శ్రీకాంత్, ప్రధాన సలహాదారుడిగా ర్యాకం మల్లేశం, మద్దెల రామచంద్రం, జాకీర్ హుస్సేన్, ఇరుకుల్ల శ్రీనివాస్, గడ్డం కృష్ణ, అనిల్, సాయిలు, కుమార్, రమేశ్ తదితరులను ఎంపియచేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రామచంద్రం మాట్లాడుతూ పేద విద్యార్థులకు సహాయ సహకారాలందిస్తామన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పూజల్లో పాల్గొన్న భక్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శనివారం మిరుదొడ్డిలోని గంగమ్మ తల్లి ఆలయ అష్టాదశమ వార్షికోత్సం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సామూహిక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాజపున్నయ్యశర్మ, చంద్రశేఖరశర్మ, రమేశ్‌శర్మ, ప్రణీత్ భరద్వాజ్, గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు


ఆయిల్‌పామ్ గెలలను పరిశీలిస్తున్న సోమిరెడ్డి తదితరులు

నంగునూరు(సిద్దిపేట): ఆయిల్‌పామ్ తోటల్లో అంతర్ పంట వేయడం ద్వారా అధిక లాభాలు గడించవచ్చని ఆయిల్‌ఫెడ్ ఫార్మర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి, జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి సూచించారు. గట్లమల్యాలలో రైతు దేవేందర్‌రెడ్డి ఆయిల్ పామ్ తోటలను శనివారం పరిశీలించి అవగాహన కల్పించారు. వేసవిలో నీటి యాజమాన్యం, అంతర్ పంట సాగు, చీడపీడల నివారణ, గెలలను కోసే విధానం, పూత, కాత దశలో తీసుకోవాల్సిన మెళకువల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారులు బాలాజీ, శంకర్, రైతులు పాల్గొన్నారు.

నెరవేరని లక్ష్యం

అధికారుల వైఫల్యం..

పర్యావరణ పరిరక్షణలో భాగంగా పట్టణ శివారులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమీపంలో నిర్మించిన ఎఫ్ఎస్‌టీపీ(ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్– మానవ ఘనవ్యర్థాల శుద్ధీకరణ కేంద్రం) అనుకున్న లక్ష్యానికి చేరువ కాలేదు. మానవ విసర్జితాలను ఎరువుగా మార్చడం తద్వారా వాయు, నీటి కాలుష్యం జరగకుండా నివారించడం ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశ్యం. అయితే దీని గురించి సెప్టిక్ ట్యాంకర్ల నిర్వాహకులకు, అలాగే రైతులు, ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు.


ఎరువులను శుద్ధిచేసే యంత్రం

ఎఫ్ఎస్‌టీపీకి కరువైన ఆదరణ
- మానవ వ్యర్థాలను ఎరువుగా మార్చడమే ధ్యేయం
- రూ.73లక్షలతో నిర్మాణం
- ఆసక్తి చూపని సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లు
- అవగాహన కల్పించని అధికారులు

దుబ్బాకటౌన్: మూడు నెలల క్రితం జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. కానీ మూడు నెలలు గడిచినా ఆశించిన రీతిలో సెప్టిక్ ట్యాంక్ క్లీనర్లు వ్యర్థాల శుద్ధీకరణకు ఆసక్తి చూపక వాహనాలు రావడం లేదు. దీంతో మానవ ఘనవ్యర్థాలతో ఎరువుల తయారీకి నిర్మించిన కేంద్రం ఆదరణ లేక వెలవెలబోతుంది.

ప్రైవేటు సంస్థ ద్వారా నిర్వహణ

గత ప్రభుత్వ హయాంలో ఎకరం విస్తీర్ణంలో రూ.73 లక్షలతో 'మన ఆరోగ్యం మన చేతుల్లోనే' అనే నినాదంతో అధికారులు ఎఫ్ఎస్‌టీపీ పనులు ప్రారంభించారు. ఎన్నో అడ్డంకులను దాటుకొని ఎట్టకేలకు 2025, జనవరి 18న ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ దానిని ప్రారంభించారు. ప్రస్తుతం హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ సంస్థ ద్వారా ఈ ఎఫ్ఎస్‌టీపీ నిర్వహణ కొనసాగుతోంది.


తయారీ లేక వెలవెల బోతున్న కేంద్రం

మొక్కలకు వినియోగించడమే లక్ష్యం

ఇళ్లలో నిండిన సెప్టిక్ ట్యాంకుల నుంచి మానవ మల వ్యర్థాలను ట్యాంకర్ల ద్వారా సేకరించి, వాటిని శుద్ధిచేసి సేంద్రియ ఎరువుగా మార్చి మొక్కలకు వినియోగించడం ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశ్యం. ఇక్కడ తయారైన ఎరువులను రైతులకు విక్రయిస్తారు. వాటిని కూరగాయల సాగుకు విరివిగా వినియోగించుకోవచ్చు. దీని ద్వారా రైతులు మంచి లాభాలు పొందే అవకాశం ఉంది.

రోజుకు 10 వేల లీటర్ల సామర్థ్యం

ఎఫ్ఎస్‌టీపీలో రోజుకు పదివేల లీటర్ల ఘన వ్యర్థాలను శుద్ధిచేసే సామర్థ్యం ఉంది. కాని ఆ స్థాయిలో వ్యర్థాలు రాక శుద్ధీకరణ కావడం లేదు. గడిచిన మూడు నెలల్లో ఈ కేంద్రానికి కేవలం 2,500 లీటర్ల వ్యర్థాలు మాత్రమే వచ్చాయి. ఇళ్లల్లో సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్‌చేసే ట్యాంకర్ల యజమానులతో అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి అవగాహన సమావేశం నిర్వహించలేదనే విమర్శలున్నాయి. దీంతో ఆదరణ కరువైంది.

చిత్రాలతో అవగాహన


ఎఫ్ఎస్‌టీపీ కేంద్రం వినియోగంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తాం. ఈ ఎరువు వల్ల కలిగే ప్రయోజనాల గురించి రైతులకు, ప్రజలకు వివరిస్తున్నాం. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో గోడలపై ఎఫ్ఎస్‌టీపీ ప్రాముఖ్యత, వినియోగం, తెలిపే చిత్రాలను వేయిస్తున్నాం. సెప్టిక్ క్లీనింగ్ వాహనాల నిర్వాహకులతో త్వరలోనే సమావేశం నిర్వహిస్తాం.

– శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, దుబ్బాక

పంటల పరిశీలన

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని ధర్మారం, పీర్లపల్లి, ఇటిక్యాల, అలిరాజ్‌పేట, జగదేవ్‌పూర్, దౌలాపూర్ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన వడగళ్ల వర్షానికి నష్టపోయిన పంటలను శనివారం మండల వ్యవసాయ విస్తీరణ అధికారులు పరిశీలించారు. ఏఈఓలు ఖలీల్, కిరణ్, కృష్ణమూర్తి, రేఖ, మమత ఆయా గ్రామాల్లో రైతుల పొలాలను వద్దకు వెళ్లి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 330 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందన్నారు. ప్రాథమికంగా అంచనా వేశామని, ఆయా రైతుల వివరాలను పై అధికారులకు నివేదిస్తామని చెప్పారు.


జగదేవ్‌పూర్‌లో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

అవినీతికి పాల్పడుతున్న అధికారులు

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



మాట్లాడుతున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ డిమాండ్ చేశారు. సిద్దిపేటలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్‌లో కొందరు అధికారులు అవినీతికి పాల్పడుతున్నా పై స్థాయి అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారన్నారు. మున్సిపల్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై త్వరలోనే ఏసీబీ అధికారులను కలిసి ఆధారాలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిద్దిపేట అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వహాబ్, ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రాశాద్, సంతోష్, నజ్జు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయడమే ధ్యేయం

ఎంఈఓ కృష్ణ

గజ్వేల్‌రూరల్: పిల్లల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే సమ్మర్ క్యాంపు ఉద్దేశ్యమని ఎంఈఓ కృష్ణ అన్నారు. మండల పరిధిలోని ముక్తమాసాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో గత 24న ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ విద్యాసంవత్సరం ముగిసిన తర్వాత విద్యార్థులకు ఆటపాటలతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసేందుకు ఈ శిబిరం నిర్వహించామన్నారు. శిబిరంలో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించిన హెచ్ఎం నర్సింహులు, ఇతర ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. అనంతరం క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి స్వాతి, ఏపీటీఎఫ్ నాయకులు విద్యాసాగర్, ఎస్‌జీటీయూ నాయకులు సురేశ్, ఉపాధ్యాయులు పద్మ, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బీరమ్మ, సాయికిరణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న అధికారులు

ఉపాధి కల్పనలో షరతులుండొద్దు

దివ్యాంగుల ఏజేసీ నాయకులు

సిద్దిపేటకమాన్: దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పనలో ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు రుణాలు అందించాలని తెలంగాణ దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు శంకర్, సంపత్ డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ దివ్యాంగులకు అన్ని రంగాల్లోను ఐదు శాతం రిజర్వేషన్‌లు కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ.6వేల ఫించన్‌లు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాస్‌లో ప్రాధాన్యం కల్పించాలని కోరారు. అలాగే దివ్యాంగులకు ఉచిత విద్యను అందించాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డ్ ఇచ్చి 150 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లేశం, బాబు, అంజయ్య, కనకరాజు, సరిత, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న జేఏసీ నాయకులు

5న పీపీటీ ప్రవేశ పరీక్ష

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఐదో తరగతి నుంచి డిగ్రీ వరకు ఉచిత వసతి, చదువు కోసం అర్హులైన విద్యార్థులకు నిర్వహించే ప్రవేశ పరీక్ష ఈ నెల 5న ఉదయం 10గంటలకు సిద్దిపేట ప్రతిభ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శనివారం పేర్కొన్నారు. పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్(పీపీటీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ అర్హత పరీక్షల్లో రాణించిన వారికి డిగ్రీ వరకు ఉచిత వసతి, విద్య అందించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం జిల్లా అధ్యక్షుడు షేక్ వలీ అహ్మద్‌ను(94416 79704), రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.వెంకట్ కిరణ్(99484 39063), జిల్లా కార్యదర్శి శివలింగం(96189 30169)ను సంప్రదించాలని సూచించారు.

చర్యలు తప్పవు

మద్దూరు(హుస్నాబాద్): ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని దూల్మిట్ట తహసీల్దార్ మధుసూదన్ హెచ్చరించారు. మండలంలోని జాలపల్లిలోని మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్‌లను ఆయన శనివారం స్వాధీనం చేసుకొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడతూ ట్రాక్టర్ యజమానులకు రూ.10 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: డిగ్రీలో చేరే విద్యార్థులు దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిత అబ్రహం తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో డిగ్రీలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొదటి విడత ఈనెల 3 నుంచి 21వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరిస్తారని, మళ్లీ మే 10 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం కల్పిస్తారని చెప్పారు. మే 29న మొదటి విడత సీట్లు కేటాయిస్తారని తెలిపారు. అదే విధంగా రెండో విడతలో భాగంగా మే 30 నుంచి జూన్ 8 వరకు దరఖాస్తుల స్వీకరణ, మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్స్, జూన్ 13న సీట్ల కేటాయింపు ఉంటుందని చెప్పారు. మూడో విడతలో భాగంగా జూన్ 13 నుంచి 19వరకు దరఖాస్తుల స్వీకరణతో పాటు వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం ఉంటుందని, జూన్ 22న సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. జూన్ 30 నుంచి తరగతులు ప్రారంభవుతాయని తెలిపారు. కళాశా లలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో బీఏ, బీకాం(కంప్యూటర్స్), బీఎస్సీ అన్ని గ్రూపులున్నాయని, అదే విధంగా ఈ విద్యా సంవత్సరం నుంచి బీబీఏ కోర్సు కూడా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు దోస్త్ కళాశాల కోడ్ 16029ను ఎంచుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని చెప్పారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలి

సీఐ లతీఫ్

తొగుట(దుబ్బాక): సమస్యల పరిష్కారం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని సీఐ లతీఫ్ సిబ్బందికి సూచించారు. సర్కిల్ పరిధిలోని సిబ్బందికి స్టేషన్ ఆవరణలో శనివారం పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యంతాగి వాహనాలు నడిపి విలువైన ప్రాణాలు కోల్పోవద్దన్నారు. చెడు వ్యసనాలకు పోలీసులు దూరంగా ఉండాలని సూచించారు. తాత్కాలిక ఆనందం కోసం జీవితాలను పాడుచేసుకోవద్దని, విధినిర్వహణలో అవినీతికి పాల్పడి ఎదుటివారి వద్ద చులకన కావద్దని కోరారు. అందరూ ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఉదయం సాయంత్రం తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకొంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్గల్‌కు అధిక ప్రాధాన్యం

మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

వర్గల్(గజ్వేల్): తాను పుట్టి, పెరిగిన వర్గల్ గ్రామానికి, మండలానికి ప్రభుత్వ పథకాల పంపిణీలో అధిక ప్రాధాన్యం కల్పిస్తానని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. వర్గల్‌లో శనివారం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురవుతున్నా తన దృష్టికి తీసుకు రావాలన్నారు.

దాడి ఘటనతో బీజేపీకి సంబంధం లేదు

జనగామ జిల్లా అధ్యక్షుడు రమేశ్


మాట్లాడుతున్న రమేశ్

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వేచరేణి గ్రామం ఎల్లదాసునగర్‌లో దళిత యువకుడిపై జరిగిన దాడితో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని ఆ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు చౌడ రమేశ్ అన్నారు. పట్టణ కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఓ వ్యక్తి తాగిన మైకంలో హిందూ దేవత విగ్రహాలను అవమానపరచడంతో స్థానికులు, హనుమాన్ భక్తులు దండించారన్నారు. కానీ ఈ ఘటనతో తమ పార్టీకి ఎలాంటి సంబంధంలేదని, ఈ ఘటనను ఆసరాగా తీసుకొని కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు కేపీఎల్ఎన్ రెడ్డి, దశమంతరెడ్డి, ఎల్లయ్య, శ్రీనివాస్, సురేందర్, బాల్‌నర్సయ్య, మహేశ్, ఉమారాణి, లక్ష్మారెడ్డి, నాగరాజు తదితరులున్నారు.

'రాజీవ్ యువ వికాసం'పై సమీక్ష

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంపై శనివారం మండల ప్రత్యేక అధికారి రాధిక సమీక్ష సమావేశం నిర్వహించారు. పథకంలో భాగంగా దరఖాస్తుదారుల నుంచి సేకరించిన దరఖాస్తులపై ఆమె చర్చించారు. కార్యక్రమంలో మద్దూరు ఎంపీడీఓ రామ్మోహన్, ధూళ్మిట్ట ఎంపీడీఓ వీరరాజు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల అధికారులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో చర్చిస్తున్న ప్రత్యేక అధికారి రాధిక

దోషులను కఠినంగా శిక్షించాలి

హుస్నాబాద్: వేచరేణి గ్రామంలో దళిత యువకుడిపై దాడిచేసిన దోషులను కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు లింగాల సాయన్న, ముక్కెర సంపత్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అజయ్ స్నానం చేయకుండా గుడిలోకి వెళ్లాడని పలువురు మూకుమ్మడిగా దాడి చేశారని, ఇలా చట్టాన్ని చేతిలోకి తీసుకోవడం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వం

దుబ్బాకటౌన్: కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమని, వారి కష్టాలు తీర్చేందుకే ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన తొమ్మిది మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.2.8 లక్షల విలువ గల సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పథకం పేద ప్రజలకు వరం లాంటిదని, ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యలున్నా తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి చర్యలు తీసుకొంటానని చెప్పారు. నాయకులు రవి, రాజిరెడ్డి, సాయి, జనార్దన్‌రెడ్డి తదిరులున్నారు.

ఆడబిడ్డలకు అండగా..

వర్గల్(గజ్వేల్): పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా నిలుస్తుందని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మెన్ బాగనోల్ల విజయ అన్నారు. శనివారం ఆమె తహసీల్దార్ బాలరాజుతో కలిసి 108 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, డైరెక్టర్ నర్సారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్: మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.విశ్వనాథ్ శనివారం తెలిపారు. ప్రతి గ్రూపులోను 40 సీట్లు ఉన్నాయని, బాలికలకు ఉచిత హాస్టల్ వసతి ఉందని పేర్కొన్నారు. 5 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ 2 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

◆ ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ వేడుకలు

బెజ్జంకి(సిద్దిపేట): ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం బెజ్జంకిలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ మండల కార్యదర్శి బొనగిరి రూపేశ్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధు, శ్రావణ్, మండల ప్రధాన కార్యదర్శి మహేశ్, లక్ష్మణ్, చరణ్, తిరుపతి, సాయిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

◆ రూ.4లక్షల చెక్కు అందచేత

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రానికి చెందిన కామ మహేందర్‌కు పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం శనివారం రూ.4లక్షల ఎల్‌ఓసీ చెక్కును అందించారు. మహేందర్ కుమారుడు అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆర్థికంగా ఆదుకోవాలని చంద్రంను అభ్యర్థించాడు. దీంతో చంద్రం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా ఎల్‌ఓసీ మంజూరైంది.

◆ పాలీసెట్‌కు ఉచిత శిక్షణ

గజ్వేల్: ప్రభుత్వ ఆదర్శ గురుకుల పాలిటెక్నిక్‌లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం కోసం ఈనెల 5 నుంచి 12 వరకు నిర్వహించే పాలీసెట్ పరీక్ష కోసం ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ సీహెచ్‌వీ కృష్ణారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నేరుగా లేదా 99513 76362, 97059 29573లలో సంప్రదించాలని సూచించారు.

హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో..

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో పాలీసెట్ రాసే విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి 12 వరకు కోచింగ్ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు అనుభవం కలిగిన అధ్యాపకుల చేత కోచింగ్ ఇప్పిస్తామని ఆసక్తి కలిగిన విద్యార్థులు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాల కోసం 79972 78636ను సంప్రదించాలని సూచించారు.

అలయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అలయన్స్‌క్లబ్‌లో భాగమైన సాయి గాయత్రి క్లబ్ అధ్యక్షులు ప్రసన్న ఆధ్వర్యంలో సిద్దయ్య వజ్రమ్మ ఆర్థిక సహాయంతో శనివారం జిల్లా కేంద్రంలో మజ్జిగ వితరణ చేశారు. కార్యక్రమంలో జిల్లా అలయన్స్‌క్లబ్ గవర్నర్ ఈశ్వర్ చరణ్, ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ ఆత్మ రాములు, ధనుంజయ, కైలాసం తదితరులు పాల్గొన్నారు.


మజ్జిత వితరణ చేస్తున్న క్లబ్ సభ్యులు